ARK MEDIA SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 270 | గురువారం, అక్టోబర్ 22, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# 2028 నాటికి పోలీసు ఖాళీలన్నీ భర్తీ

**పోలీసు శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు**
**అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ**
**వీరమరణం పొందిన పోలీసులకు భారీ పరిహారం**
**సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు**
**ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు సీఎం పిలుపు**







**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని :**

2028 నాటికి పోలీసు శాఖలో అన్ని ఖాళీలను విడతలవారీగా భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ, సమాజ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో 154 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. 2025 అక్టోబర్ నాటికి దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలను నియమించామని, 2026లో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతించామని, ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు ఎక్స్‌గ్రేషియాను రూ.కోటికి, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.1.25 కోట్లకు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు రూ.1.50 కోట్లకు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్లకు పెంచినట్లు వివరించారు. అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్య సహాయం, వైద్య విద్యలో ప్రత్యేక సీట్లు కల్పిస్తున్నామని, భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ.16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షలు అందించాలని నిర్ణయించామని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించారు. పోలీసు సిబ్బంది పిల్లల విద్య కోసం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు కీలకమని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి సురక్షిత వాతావరణం అవసరమని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందిస్తూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలని పిలుపునిచ్చారు. కల్తీ ఆహార నియంత్రణకు టీజీ సేఫ్, మహిళల భద్రతకు షీ టీమ్స్, మహిళలు, పిల్లలకు అత్యవసర రక్షణ అందించేందుకు స్పందన--తక్షణ రక్షణ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పోలీసులు క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పించాలని, సామాన్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి, నేరస్థుల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. అమరవీరుల కుటుంబాల బాధను పూర్తిగా తీర్చలేకపోయినా ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం వారికి అండగా ఉంటాయని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొనగా, ఈ ఏడాది అమరులైన పోలీసుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు.

## కొనరావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం రోజున కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వంవహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహనకలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో.పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఎస్పీ వెంట సిఐ రవికుమార్, ఎస్.ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

## 108 అంబులెన్స్‌లో సురక్షిత ప్రసవం.

**సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లీబిడ్డలను కాపాడిన సిబ్బంది.**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిది ) ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 21 :**

గర్భిణికి మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం చేశారు. ఈ ఘటన గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నస్రీన్ అనే గర్భిణికి మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో పరిస్థితిని గమనించిన అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు (ఈఎంటీ) చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ అప్రమత్తమయ్యారు. అత్యవసర పరిస్థితిని గుర్తించి సమయస్ఫూర్తితో వ్యవహరించిన సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. షేక్ నస్రీన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో వెంటనే స్పందించి సురక్షిత ప్రసవానికి సహకరించిన 108 అంబులెన్స్ సిబ్బందిని గర్భిణి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

## పోలీసు అమరవీరులకు తన చేతి నుండి జాలువరి న పద్యలతో ఘన నివాళి....

**పోలీసుసోదరులకు సెల్యూట్ తో.... (పద్యరవళులు)**
**పద్యాల రూపంలో వారి త్యాగాన్ని కొనియాడిన సోదరుడు**

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

రక్షక భటులన్ననెవరు?
రాక్షసులదునుముచుశాంతిఁ రయమున నిల్పున్ !
తక్షణమే వచ్చి ప్రజను
రక్షించుచు యాపద దరి రానీయరయా!! ... 1

ప్రాణములకునాపదయును
రానీ,యింతయు బెదరని రణధీరులులే !
ఠాణాయే దేవళముగ
క్షీణింపగనేరములవి క్షేత్రమునందున్ !! 2

మీరే తల్లియు దండ్రియు
మీరే దైవము జనులకు మేలగుహితులే..
నేరము జేసెడివారల,
చోరుల,దోషుల యెడలన చురకత్తులులే!! 3

సామాజిక భద్రతకై
యేమరపాటెరుగనట్టి యెంతటి విధియో ..!
ఏమో ! మీరేలేనిచొ
భూమండలమంతజూడ బూడిదయగునో ..!

..... మిత్రులందరికి నమస్సులతో...

## తెలంగాణకు బీసీ సీఎం.. ఇప్పుడే కాదు

**బీసీ సీఎం కావడానికి గడువు లేదన్న మహేశ్ గౌడ్**
**కాంగ్రెస్‌తోనే బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య**
**2039 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా**
**రేవంత్ పాలనపై టీపీసీసీ చీఫ్ ప్రశంసలు**
**బీఆర్ఎస్‌పై ప్రశ్నలు.. బీజేపీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్ (నేటి ప్రభాత దర్శిని):**

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉన్నాయని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాకుండా 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని మహేశ్ గౌడ్ అన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం





**వారి స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి**

**అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

విధి నిర్వహణలో దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే) సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్రతో కలిసి కలెక్టర్ పుష్పగుచ్ఛాలు సమర్పించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశ అంతర్గత భద్రతలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ, సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించే సంస్మరణ కార్యక్రమాలు సమాజంలో దేశభక్తి, సేవాభావం, విధి పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విట్టల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కోనాపూర్ లో ఘనంగా అన్నదానం




**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో దుర్గామాత మండపం ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గత16 సంవత్సరాలుగా దుర్గామాత అమ్మవారిని ప్రతిష్టించి, భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని మండపం నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానంలో దాదాపు 1500 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండపం నిర్వాహకులు వీరేందర్, లక్ష్మణ్, రమేష్, రాజన్న, దత్తు, బలరాజ్ గౌడ్, బాలరెడ్డి, తోట శంకర్, మెరుగు వెంకటి, మండపం పూజారి వీరభద్రప్ప, దుర్గామాత మాల ధరించిన స్వాములు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అమ్మవారి లడ్డును వేలంపాటలో 2.616 రూపాయలకు దక్కించుకున్న గైని పద్మ సుధాకర్



**కామారెడ్డి /సదశివానగర్. నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి.**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ భూంపల్లి గ్రామంలో విరాట్ యూత్ ఆధ్వర్యంలో 20 వార్షికోత్సవం సందర్భంగా దుర్గామాతకు వేద పురోహితుడు ప్రభు ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు మాలాధారణ కంకణదారులతో ప్రత్యేక గణపతి పూజ నవగ్రహ పూజ పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కౌమారీ పూజలు. ప్రత్యేక దీపాలంకరణ. లక్ష్మి సమేత సామూజిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారి ప్రత్యేక పూజలు అందుకున్న. లడ్డును 2.600 రూపాయలకు దక్కించుకున్న గైని పద్మ సుధాకర్. వారి కుటుంబానికి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని లడ్డును ప్రధానం చేసిన భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్ హిందూ విరాట్ యూత్ క్యాషియర్ సుంకరి వేణుగోపాల్. లడ్డు ప్రధానం చేశారు అంతేకాకుండా తొమ్మిది అవతారాలతో దుర్గమ్మ తల్లి తొమ్మిది చీరాలను వేలం వెయ్యడం జరిగింది 1. చీర సుంకరి లక్ష్మీ నందం -8516. 2.చీర సుంకరిలత రాజయ్య -1516. 3. చీర- సుంకరి సాయవ్వ మల్లయ్య -1516. 4 .చీర గైని శాంత లక్ష్మణ్-1116. 5.చీర గైని రాధా శ్రీనివాస్ 3116. 6. చీర సుంకరి కళ్యాణి లింగం -2616. 7 చీర సుంకరి లలిత పెద్ద లింగం -3116.8వ. చీర సుంకరి సుగుణ రమేష్-2816. 9వ చీర గైని భారతి సాయిలు-3816. 1వసేపు సుంకర స్వప్న రాజు 1516. 2సేపు గైని వనమాల భాస్కర్ 1116.3సేపు సుంకరి లత రాజయ్య- 616. 4సేపు గైని అమల సూర్య ప్రకాష్ 616.5సేపు సుంకరి సుదీష్న రవికుమార్ 516. 6సేపు సుంకర్ గౌతమి కోటేశ్వర్516. 7వ సేపు గైని వనమాల భాస్కర్ 516. 8వ సేపు గైని శాంత లక్ష్మణ్ 516. 9సేపు సుంకరి నవనీత వేణుగోపాల్ 516. 10వ సేపు సుంకరి లక్ష్మి నర్సింలు 516.1వ దానిమ్మ గైని సావిత్రి శంకర్ 516. 2దానిమ్మ గైని జనవ్వ 516. 3 దానిమ్మ సుంకరి భూమవ్వ 516. 4 దానిమ్మ గైని అనసూయ రమేష్ 516. వేలంలో లడ్డు చీర దానిమ్మ వంటి దక్కించుకున్నారు వారికి వారి కుటుంబానికి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని హిందు విరాట్ యూత్ సభ్యులు కోరుకున్నారు ఈ కార్యక్రమంలో హిందూ విరాట్ అధ్యక్షులు గైని రాజేందర్. ఉపాధ్యక్షులు సుంకరి నవీన్ గైని శేఖర్. క్యాషియర్ సుంకరి వేణుగోపాల్. డీజే నిర్వాకుడు గైని రిశ్వంత్( బన్నీ) ప్రధాన కార్యదర్శి గైని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**అమరవీరుల త్యాగాలకు నివాళి.. మాదక ద్రవ్యాలపై అవగాహన**

**సైబర్ నేరాల పట్ల అప్రమత్తత.. రోడ్డు ప్రమాదాల నివారణ**

**మహిళల రక్షణకు షీ టీమ్స్**




**కామారెడ్డి (నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి):**

అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ అమరవీరుల త్యాగాలను, సేవలను కొనియాడుతూ కామారెడ్డి జిల్లా బస్టాండ్ ఆవరణలో 21-10-2026న పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను సేవించవద్దని, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, హెల్మెట్ ఉపయోగించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడవద్దని అవగాహన కల్పించారు. సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్ 1930, మాదక ద్రవ్యాల నిర్మూలన టోల్ ఫ్రీ నంబర్ 1908 గురించి వివరించారు. ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని, అత్యవసర సమయంలో డయల్ 112కు కాల్ చేయాలని సూచించారు. మహిళల రక్షణకు షీ టీమ్ అందుబాటులో ఉందని, షీ టీమ్ నంబర్ 8712686094 అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని, దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గుర్తుతెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, యు. శేషరావు, కానిస్టేబుల్ ప్రభాకర్, సాయిలు మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా షీ టీమ్ డబ్ల్యూపీసీ సౌజన్య, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్ విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించిన వీసీ అఖిల్

**విద్యార్థులకు విలువైన సూచనలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు**



**నేటి ప్రభాత దర్శిని, అక్టోబర్ 21 (ముస్తాబాద్ -ప్రతినిధి):**

నామాపూర్ గ్రామంలో గల మోడల్ స్కూల్ విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం దోహదపడుతుందని వీసీ అఖిల్ అన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా తొమ్మిదో రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లోని శ్రావణి బ్యూటీ పార్లర్‌ను ఆయన సందర్శించారు. టీజీఎంఎస్ ముస్తాబాద్ కేంద్రానికి చెందిన బ్లాక్ అండ్ వైట్ (బి అండ్ డబ్ల్యూ) ట్రేడ్ విద్యార్థులు అక్కడ పొందుతున్న ప్రాక్టికల్ శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడి, ప్రతిరోజూ నేర్చుకుంటున్న పనులు, ఆచరణాత్మక నైపుణ్యాలు, శిక్షణ ద్వారా సాధిస్తున్న అభ్యసన ఫలితాల గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రత్యక్షంగా పనులు నేర్చుకుంటున్న తీరును పరిశీలించి, వృత్తికి సంబంధించిన అంశాలపై పలు సూచనలు చేశారు. ఇంటర్న్‌షిప్ అనేది కేవలం శిక్షణ మాత్రమే కాకుండా, భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పునాది అని అఖిల్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పనిలో మరింత నైపుణ్యం సాధించాలని సూచించారు. పుస్తక జ్ఞానంతోపాటు క్షేత్రస్థాయిలో అనుభవం సంపాదించడం ద్వారా వృత్తిపరమైన సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలని, పని ప్రదేశంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. శిక్షణ సమయంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకుంటూ, కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకొని, భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందడంతోపాటు ఉద్యోగ అవకాశాలను సాధించే దిశగా కృషి చేయాలని ప్రోత్సహించారు. వీసీ అఖిల్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి మార్గదర్శనం చేయడం వల్ల వారు మరింత ఉత్సాహంతో శిక్షణలో పాల్గొనేందుకు ప్రేరణ లభించింది. ఇంటర్న్‌షిప్ ద్వారా పొందిన అనుభవాన్ని భవిష్యత్తు అభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ మున్సిపల్ కొండల్ రెడ్డి, బ్యూటీ పార్లర్ ఉపాధ్యాయినీరాలు భవాని, శ్రావణి బ్యూటీ పార్లర్ ట్రేనర్ శ్రావణి విద్యార్థినీలు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఘనంగా రావణదహన కార్యక్రమం





## కుటుంబ సభ్యులతో వీక్షించిన పోచారం

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

బాన్సువాడ, విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో నిర్వహించిన రావణదహన కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వరుసగా 16వ సంవత్సరం ఈ రావణదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రావణదహనంతో మినీ స్టేడియం పండుగ సందడితో కళకళలాడింది. అనంతరం ఎమ్మెల్యే తన స్వగ్రామమైన పోచారం గ్రామంలో హనుమాన్ మందిరం వద్ద జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్థులకు జమ్మి ఆకులను పంపిణీ చేస్తూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజు,మున్సిపల్ చైర్మన్ కాసుల విజయ, ఎమ్మెల్యే పోచారం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ ఎమ్మెల్యే తీరుపై ఏనుగు రవీందర్ రెడ్డి ఫైర్



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరంకుశ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ తిరుమల ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన సీనియర్ నాయకులను పక్కన పెట్టి, బీజేపీ, బీఆర్ఎస్ నుండి వచ్చిన వారికి సహకార సంఘ చైర్మన్ పదవులు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కోటగిరి మండలం ఎత్తొండ సహకార సంఘం చైర్మన్ గా బీజేపీ వ్యక్తికి పదవి ఇవ్వడాన్ని తప్పుబట్టారు. తాను బాన్సువాడ స్థానికుడినేనని, ఎర్రపహాడ్ లో ఉన్న ఓటును తొలగించుకుని బాన్సువాడలో ఓటు తీసుకున్నానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బాన్సువాడ నుండే పోటీ చేస్తానని, ఇక్కడే ఉండి పార్టీని బలోపేతం చేస్తానని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సురేష్ షెట్కర్ కు 33 వేల మెజారిటీ ఇచ్చింది కాంగ్రెస్ సీనియర్ నాయకుల కృషి వల్లేనని, కానీ ఎంపీ కూడా వారిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం స్పందించి సీనియర్ కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, లేకుంటే బాన్సువాడలో కాంగ్రెస్ బలహీనపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మాసాని శ్రీనివాస్ రెడ్డి, ద్రోణవల్లి సతీష్, కొత్తకొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వినోదానికి కొత్త శోభ

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి అక్టోబర్ 21, 2026:**




అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ప్రజలకు ఆహ్లాదకరమైన వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో పిక్చర్ టైమ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమన్వయంతో గాలి బుడగల నిర్మాణంతో రూపొందించిన ఆధునిక సినిమా థియేటర్‌ను పునః ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గాలి బుడగల థియేటర్ ప్రారంభించడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన వినోద సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, మహిళా సంఘాల సహకారం, సమన్వయంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. పిక్చర్ టైమ్ సినిమా థియేటర్‌లో పుష్‌బ్యాక్ సీట్లు, ఎయిర్ కండిషనింగ్, డాల్బీ సౌండ్ వంటి ఆధునిక సదుపాయాలతో పాటు ఆహార పదార్థాలు, పానీయాలు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు, యువత, కుటుంబాలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు వినోదంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం సానుకూల పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ స్వామికి అమ్మవారి ఫొటో బహూకరణ

**అమ్మవారి నిమజ్జనం సందర్భంగా అందజేత**
**దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో పూజలు**
**అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకులకు అందజేత**
**యూత్ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం**
**అమ్మవారి ప్రసాదం అందజేత**




**ఎల్లారెడ్డిపేట (నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి):**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ఏర్పాటు చేసి నిత్య పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి నిమజ్జనం సందర్భంగా దుర్గామాత చిత్రపటాన్ని అశ్విని హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామికి యూత్ సభ్యులు వడ్నాల భాస్కర్, నంది నరేష్, జవాజి సంజీవ్ తదితరులు కలిసి అమ్మవారి ఫొటోతో పాటు ప్రసాదాన్ని అందజేశారు.

# పోచారం గ్రామంలో ఘనంగా అలై-బలై కార్యక్రమం



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

దసరా పండుగ సందర్భంగా బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోచారం గ్రామంలో అలై-బలై కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గం నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి దసరా బంగారం (జమ్మి ఆకు) ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఏటా దసరా పండుగకు అందరినీ ఒకచోట చేర్చి ఆత్మీయంగా అలై-బలై కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి





## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని రఘునాథపల్లి మండల పరిధిలో గల పోలీస్ స్టేషన్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న నేర ధోరణులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, నేరాలను వేగంగా ఛేదిస్తున్న పోలీసుల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐలు వేణు, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, భరత్ సుమన్, స్థానిక ఎస్ఐ మోదుగు భరత్, పోలీసు సిబ్బంది, పాల్గొని అమరవీరులకు నివాళులు సమర్పించారు.

# మహేష్ కుమార్ గౌడ్ ప్రతిష్టకు భంగం కలిగించారంటూ ఛత్రినాక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు.. ఆరుగురు పై కేసు నమోదు.



**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్, చంద్రాయన గుట్ట!**

బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయ ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు, సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం మాజీ అధ్యక్షుడు దివంగత నేత, జి. మహేష్ కుమార్ గౌడ్ పై చేసిన నిరాధార ఆరోపణలకు ఆయనతోపాటు కుటుంబ ప్రతిష్టకు భంగం కలిగించారంటూ ,దాఖలైన ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో ఛత్రినాక పోలీసులు ఆరుగురు పై కేసు నమోదు చేశారు. మహేష్ కుమార్ గౌడ్ భక్తురాలి నుంచి 25 లక్షలు తీసుకున్నారంటూ వివిధ సమావేశాలు, వాట్సాప్ గ్రూపులు ,తదితర మధ్యమాలు ద్వారా ఆయన కుటుంబ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై న్యాయం కోరుతూ ఫిర్యాదుదారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## స్మృతి తరంగాలు: మన 'సహాయ' మిత్రుడు రాజిరెడ్డికి అశ్రునివాళి



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 21 :**

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, కానీ కొన్నిసార్లు అది మిగిల్చే గాయాలు మానవుల ఊహకు అందవు. గత ఇరవై ఏళ్లుగా దసరా మరుసటి రోజున మనమంతా ఒకచోట చేరి, పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ,ఎల్లారెడ్డిపేట 'సహాయ ఫౌండేషన్' ద్వారా సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో సాగిన మన ప్రయాణంలో ఈరోజు ఒక పెద్ద శూన్యం ఆవరించింది. ఎప్పుడూ మనతో ఉంటూ, మన నవ్వుల్లో భాగస్వామియైన మన తోటి మిత్రుడు సందుపట్ల రాజిరెడ్డి నేడు మన మధ్య లేరనే నిజాన్ని నమ్మడం మనసుకి ఎంతో భారంగా ఉంది. పోయిన ఏడాది సరిగ్గా ఇదే సమయానికి రాజిరెడ్డి మనతోనే ఉన్నాడు. మన భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడాడు, కలిసి నవ్వాడు, పాత స్కూల్ రోజులను గుర్తుచేసుకున్నాడు. కానీ, ఈ ఏడాది ఆ స్థానం ఖాళీగా దర్శనమిస్తోంది. విధి ఆయన్ను మన నుంచి ఇంత త్వరగా దూరం చేస్తుందని ఎవరూ ఊహించలేదు. క్లాస్‌రూమ్ జ్ఞాపకాల నుండి మొదలైన మన 1995-96 ఎస్ఎస్‌సి బంధం, ఫౌండేషన్ రూపంలో ఇంత సుదీర్ఘంగా సాగడానికి రాజిరెడ్డి లాంటి స్నేహితుల తోడ్పాటు ఎంతో అమూల్యమైనది. ఈ రోజు మన 'సహాయ ఫౌండేషన్' వేదికపై ఆయన చిత్రపటానికి కొవ్వొత్తి వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పిస్తున్నప్పుడు.. ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తిరగక మానవు. ఆయన భౌతికంగా మనకు దూరమైనా, మన మనసుల్లో ఆయన జ్ఞాపకాలు, ఆయన చూపిన స్నేహానురాగాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.ఏ లోకాన ఉన్నా మన రాజిరెడ్డి ఆత్మకు సంపూర్ణ శాంతి చేకూరాలని,ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి ఆ భగవంతుడు కొండంత ధైర్యాన్ని ప్రసాదించాలని మన 'సహాయ ఫౌండేషన్' తరపున, 95-96 ఎస్ఎస్‌సి మిత్రులమంతా కలిసి ముక్తకంఠంతో ప్రార్థిస్తున్నాము.

## కారు ఢీకొని తండ్రి, కుమారుడికి తీవ్ర గాయాలు.

### వల్భాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం

**హుజురాబాద్ నేటి ప్రభాత దర్శిని అక్టోబర్ 21..**



ఎలకతుర్తి మండలం వల్భాపూర్ ప్రాంతంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తండ్రి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఎలకతుర్తి నుంచి హుజూరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గారంపల్లి సుమన్ (41), ఆయన కుమారుడు నాగ చరణ్ (17) రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు.గారంపల్లి సుమన్ హుజూరాబాద్ పట్టణంలో శ్రీ శ్రీరామ ఐరన్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం





### ప్రజల శాంతిభద్రతల కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలు చిరస్మరణీయం.
### లింగంపేట అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినం.. నివాళులర్పించిన ఎస్పీ మహేష్ బి. గితే.

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 21 :**

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. దేశ ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

**154 మంది అమరవీరుల పేర్ల పఠనం.**

ఈ సందర్భంగా సాయుధ పోలీసులు సంప్రదాయబద్ధంగా శోక శస్త్ర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసులు అనేక క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అంతర్గత భద్రత పరిరక్షణలో భాగంగా జిల్లాలో ఎనిమిది మందికి పైగా పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే గతంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను కేవలం సంస్మరణ దినాన మాత్రమే కాకుండా నిత్యం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా అమరవీరులు చూపిన తెగువ, నిబద్ధత, సేవాభావం తమకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని చెప్పారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం.**

1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. దేశ రక్షణ, అంతర్గత భద్రత, ప్రజల ప్రాణాల పరిరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు వీరుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటామని తెలిపారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం.**

కార్యక్రమానికి హాజరైన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు విన్నవించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలను గౌరవించడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఈ నెల 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు.**

పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, క్యాండిల్ ర్యాలీలు, రన్ కార్యక్రమాలు, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫొటోగ్రఫీ, వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యువత, విద్యార్థులు, ప్రజలు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం...





### జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
### శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం
### మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్
### విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు సన్మానం
### పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్మృతి పరేడ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్

**ఖమ్మం, అక్టోబర్-21: నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు భరోసా, రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లోని పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, పోలీస్ కమీషనర్, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులను స్మరించుకుని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. జిల్లాకలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం లడక్ సరిహద్దు ప్రాంతంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది పోలీస్ శాఖ నిత్యం ప్రదర్శించే నిబద్ధత, త్యాగం, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రగతికి తోడుగా ప్రజలకు భరోసా, రక్షణ కల్పిస్తూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు.

**మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక పోలీసింగ్ :**

ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు సహా కొత్త తరహా నేరాలు వెలుగు లోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీసింగ్ విధానాలను ఆధునీకరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధనలో పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం రెండు ముఖ్యమైన విభాగాలని, పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు.

**అమరవీరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి:**

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో పోరాడుతూ దేశ సరిహద్దులను కాపాడే క్రమంలో 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. చివరి శ్వాస వరకు దేశ రక్షణ కోసం పోరాడిన వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించు కుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను నియంత్రించడం వంటి బాధ్యతలను పోలీసులు నిరంతరం నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు తెలంగాణలో నక్సలిజం, తీవ్రవాద సమస్యలు తీవ్రంగా ఉండేవని, పోలీసుల నిరంతర కృషి, త్యాగాల ఫలితంగా ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లు శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నలుగురు పోలీసు సిబ్బంది తమ ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు సంబంధిత ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏ ఆర్ డిసిపిలు కుమారస్వామి, విజయబాబు, ఏ ఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు సిఐలు, ఆర్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.